సాక్షి తిరుపతి

ఆదివారం । 19 । మార్చి । 2023



కమనీయం కల్యాణం

రాపూరు : పెంచలకోన క్షేత్రంలో పెనుశిల నృసింహస్వామి, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మీదేవి కల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. సాయంత్రం ఊంజల్ సేవను శాస్త్రోక్తంగా జరిపించారు.



శనేశ్వరునికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి: ముక్కంటి ఆలయంలోని శనేశ్వర స్వామివారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. శుక్రవారం అర్ధరాత్రి వరకు 62,938 మంది స్వామివారిని దర్శించుకున్నారు.

న్యూస్‌రీల్

ముఖ్యమంత్రిని కలిసిన నేదురుమల్లి



ముఖ్యమంత్రిలో మాట్లాడుతున్న నేదురుమల్లి, పక్కన ఎమ్మెల్సీ పర్వతరెడ్డి తదితరులు

వెంకటగిరి : అమరావతిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నేదుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలుపొందిన పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పుష్పగుచ్ఛం అందించారు.

నేడు విద్యార్థులకు 'దీవెన'

తిరుపతి అర్బన్ : పేద విద్యార్థులకు ఉన్నత చదువులకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తోంది.అందులో భాగంగా జగనన్న విద్యాదీవెన పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం కింద ఆదివారం కృష్ణా జిల్లా నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నగదు జమ చేయనున్నారు. ఉదయం 11 గంటలకు తిరుపతి కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి కార్యక్రమం నిర్వహించనున్నారు.

'ఓపెన్'లో ప్రవేశానికి దరఖాస్తులు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతిలోని గేట్ డిగ్రీ, పీజీ కళాశాల ఆవరణలో ఉన్న ఆచార్య నాగార్జున ఓపెన్ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రంలో వివిధ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డైరెక్టర్ ఎం.సుదర్శన్ రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఇంటర్ పూర్తయినవారు ఈ నెల 28వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 63022 54918, 95022 93508 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఇంటర్ పరీక్షకు 993 మంది గైర్హాజరు

తిరుపతి ఎడ్యుకేషన్ : ఉమ్మడి చిత్తూరు జిల్లాలో శనివారం నిర్వహించిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఇంగ్లిష్ పరీక్షకు 993 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆర్‌ఐఓ వి.రమేష్ తెలిపారు.

ఎస్సీ కమిషన్ చైర్మన్ పర్యటన

తిరుపతి అర్బన్ : ఎస్సీ కమిషన్ చైర్మన్ ఎం.విక్టర్‌ప్రసాద్ జిల్లాలో రెండు రోజులు పర్యటించనున్నట్లు కలెక్టరేట్ అధికారులు తెలిపారు. శనివారం రాత్రి ఆయన తిరుమలకు చేరుకుని అక్కడే బసచేస్తారు. ఆదివారం ఉదయం తిరుపతిలో జరిగే సమతా సైనికదళ్ సాంస్కృతిక కళా గర్జనలో పాల్గొంటారని తెలిపారు.

మహిళలకు ఉపాధి శిక్షణ

చంద్రగిరి: మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఆంధ్రాబ్యాంకు గ్రామీణాభివృద్ధి సంస్థ డైరెక్టర్ సురేష్‌బాబు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఆర్యవర్క్, ఫ్యాబ్రిక్, బ్యూటీపార్లర్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. వివరాలకు 79896 80587, 94949 51289, 63017 17672 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

వైద్యాధికారులకు మెమోలు

గూడూరురూరల్ : మండలంలోని చెన్నూరు పీహెచ్‌సీని డీఎంహెచ్‌ఓ శ్రీహరి శనివారం తనిఖీ చేశారు. వైద్యసిబ్బందిపై పలు ఫిర్యాదులు రావడంతో ఆయన ఆకస్మికంగా పీహెచ్‌సీని సందర్శించారు. విధులకు గైర్హాజరైన డాక్టర్లు ప్రసూన, జ్యోతితోపాటు పలువురు సిబ్బందికి మెమోలు జారీ చేశారు.

సుపరిపాలనకే సచివాలయాలు

డక్కిలి : సుపరిపాలన అందించేందుకే ప్రభుత్వ సచివాలయవ్యవస్థను ప్రవేశపెట్టినట్లు సచివాలయాల జిల్లా అధికారి సుశీలాదేవి తెలిపారు. శనివారం మాధవయ్యపాళెం, వెలికల్లు, సంగనపల్లె, డక్కిలి సచివాలయాలను సందర్శించారు.

అవలీలగా గెలిచే స్థానంలో పీడీఎఫ్‌కు ఓటమి ఎదురైంది.. హోరాహోరీ పోటీ ఇచ్చే స్థానంలో ఘోర పరాభవం ఎదురైంది.. ఏళ్ల తరబడి ఏకపక్షంగా విజయం సాధిస్తున్న స్థానంలో అపజయం ఎదురైంది.. గెలుపోటములను శాసించే స్థాయి ఉన్న స్థానంలో తిరస్కారం ఎదురైంది.. కూర్చున్న కొమ్మనే నరుక్కున్న చందంగా తయారైంది ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ పరిస్థితి. గట్టి పట్టున్న ప్రాంతాల్లోనూ ఓటర్లు వెక్కిరించే దుస్థితి దాపురించింది. దీనికి ప్రధాన కారణం టీడీపీతో లోపాయికారీ ఒప్పందం కుదుర్చుకోవడమే అని పీడీఎఫ్ శ్రేణులు మండిపడుతున్నాయి. బాబుతో చేతులు కలిపి తీరని ద్రోహం చేశారని నేతలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. అనైతిక పొత్తు వల్లే అటు ఉపాధ్యాయులు.. ఇటు పట్టభద్రులు మొండిచేయి చూపించారని ఆవేదన చెందుతున్నాయి.



పొత్తు.. చిత్తు

- పీడీఎఫ్‌ను దెబ్బకొట్టిన టీడీపీ
- లోపాయికారీ ఒప్పందంతోనే ఓటమి
- బాబు ట్రాప్‌లో పడి మునిగిపోయామని పీడీఎఫ్ శ్రేణుల ఆవేదన

సాక్షి, తిరుపతి : తూర్పు రాయలసీమలోని ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థులు బొక్కబోర్లా పడ్డారు. టీచర్ల స్థానంలో వైఎస్సార్‌సీపీ బలపరచిన పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, గ్రాడ్యుయేట్లకు టీడీపీ తరఫున బరిలో దిగిన కంచర్ల శ్రీకాంత్ చౌదరి గెలుపొందారు. దీనిపై పీడీఎఫ్ నేతలు ఆత్మ విమర్శ చేసుకుంటున్నారు. దశాబ్దాలుగా శాసించిన స్థానాల్లో ఘోర పరాభవం మూటగట్టుకోవడంపై మల్లగుల్లాలు పడుతున్నారు. ఎక్కడ తప్పు జరిగిందో అర్థం చేసుకుని తలలు పట్టుకుంటున్నారు.

ఒప్పందమే ముంచేసింది!

2019 సార్వత్రిక ఎన్నికల నుంచి టీడీపీని వరుస పరాజయాలే వరించాయి. ప్రతి ఎన్నికల్లోనూ ఓడిపోవడంతో ఆ పార్టీ శ్రేణుల్లో నిస్తేజం అలుముకుంది. ఈక్రమంలో వచ్చిన ఎమ్మెల్సీ ఎన్నికలపైనా వారికి ఏమాత్రం ఆశలు లేవు. అయినప్పటికీ చంద్రబాబు ఆదేశాలతో తూతూమంత్రంగా పోటీ చేసేందుకు ముందుకు వచ్చారు. ఇదే సమయంలో టీడీపీ అధినేత కుతంత్రాలకు పదును పెట్టారు. ముందుగా వామపక్ష నేతలను వలలో వేసుకున్నారు. టీచర్ల ఎమ్మెల్సీ స్థానానికి మద్దతు ఇస్తామని, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి సంబంధించి టీడీపీ బలపరచిన అభ్యర్థికి రెండో ప్రాధాన్యత ఓటు వేయాలని పీడీఎఫ్‌తో ఒప్పందం కుదుర్చుకున్నారు.

బాబుతో జతకట్టి తప్పు చేశాం!

టీడీపీతో పొత్తు పెట్టుకుని తప్పు చేశామని పీడీఎఫ్ నేతలు వాపోతున్నారు. ఒప్పదం ప్రకారం గ్రాడ్యుయేట్ ఎన్నికల ప్రచారానికి తమను బాగా వాడుకున్నారని, టీచర్ల ఎన్నికకు సంబంధించి టీడీపీపై ఉన్న వ్యతిరేక భావమే నష్టం చేసిందని పీడీఎఫ్ నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము మద్దతు ఇచ్చినందునే టీడీపీకి ఓటేశామని పలువురు ఉద్యోగులు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారని వివరిస్తున్నారు. అందుకే టీడీపీ బలపరచిన అభ్యర్థి శ్రీకాంత్‌కు మొదటి ప్రాధాన్యత ఓట్లు 1,15,646 వచ్చాయని స్పష్టం చేస్తున్నారు. అవి గెలిచేందుకు చాలకపోవడంతో పీడీఎఫ్ ఓటర్లు వేసిన రెండో ప్రాధాన్యతా ఓట్లతోనే విజయం సాధించారని తెలియజేస్తున్నారు. చంద్రబాబు మాటలు నమ్మడం వల్ల తమ ఉనికినే కోల్పోయే దుస్థితి దాపురించిందని మథనపడుతున్నారు.

కనుచూపు మేరలో కనిపించని బీజేపీ

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి కనీస పోటీ ఇవ్వలేకపోయారు. ఆ పార్టీ తరఫున బరిలో నిలిచిన సన్నారెడ్డి దయాకర్‌రెడ్డికి కేవలం 6,364 ఓట్లు రావడం గమనార్హం

• విజయోత్సాహం




తూర్పురాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డికి మద్దతుగా శనివారం ఎస్వీ యూనివర్సిటీలో విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. మిఠాయిలు పంచుతూ, బాణసంచా కాల్చుతూ సందడి చేశారు. - తిరుపతి ఎడ్యుకేషన్

ప్రశాంతంగా ఎమ్మెల్సీ కౌంటింగ్

చిత్తూరు కలెక్టరేట్ : తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ శనివారంతో ముగిసింది. జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న ఎస్వీ సెట్ ఇంజినీరింగ్ కళాశాలలో కౌంటింగ్‌ను పకడ్బందీగా పూర్తి చేశారు. రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హరి నారాయణన్, జేసీ వెంకటేశ్వర్, డీఆర్‌వో రాజశేఖర్, జెడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి, పలు జిల్లాల సబ్ కలెక్టర్‌లు, తిరుపతి, అన్నమయ్య, ప్రకాశం, నెల్లూరు, జిల్లాల డీఆర్‌వోలు, పలువురు ఆర్డీవోలు విధులు నిర్వర్తించారు. ఏజెంట్లకు, కౌంటింగ్ సిబ్బందికి మంచి ఏర్పాట్లు చేశారు. కౌంటింగ్ ప్రక్రియను పూర్తి చేసినందుకు అధికారులు, సిబ్బందిని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హరినారాయణన్ అభినందించారు.

పులకించిన సప్తగిరులు



అన్నమయ్య వర్ధంతిలో అహోబిలం పీఠాధిపతి



దేవతామూర్తుల వేషధారణలో భక్తులు

తిరుమల: అన్నమాచార్యుల 520వ వర్ధంతిని పురస్కరించుకుని తిరుమలలోని నారాయణగిరి ఉద్యానవనంలో శనివారం సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారి ఊంజల్ సేవ, సప్తగిరి సంకీర్తనల గోష్ఠిగానంతో ఏడుకొండలు పులకించాయి. అహోబిల మఠం 46వ పీఠాధిపతి శ్రీమాన్‌శ్రీవణ్ శఠగోప రంగనాథ యతీంద్ర మహాదేశికన్‌స్వామిజీ అనుగ్రహభాషణం చేశారు. అహోబిలం శ్రీ నరసింహస్వామివారి అనుగ్రహంతో శ్రీ తాళ్లపాక అన్నమాచార్యులు మంత్రోపదేశం పొందారని వివరించారు. స్వామీజీని టీటీడీ ఈఓ ధర్మారెడ్డి శాలువతో సత్కరించి శ్రీవారి ప్రసాదం అందజేశారు. అనంతరం అహోబిల మఠం తరపున అన్నమయ్య విగ్రహానికి వస్త్రం సమర్పించారు. అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకులు విభీషణశర్మ, ఆలయ పేష్కార్ శ్రీహరి పాల్గొన్నారు.

మరులుగొనేలా విరుల యాగం



సుగంధ సుమాల నడుమ కల్యాణ వెంకన్న



పుష్పాలు, పత్రాలను తీసుకువస్తున్న టీటీడీ బోర్డు చైర్మన్ సతీమణి స్వర్ణలత, తదితరులు

చంద్రగిరి : జాజులు, సంపెంగలు, తామరలు, కలువలు, మల్లెలు, పారిజాతాలు, చామంతులు, గన్నేరు, నందివర్ధనాలు, మందారాలు, దేవదారు, పొగడలు, సురపొన్నలు, మొగిలిరేకులు తదితర సుగంధ సుమాలు, మరువం, దవనం, బిల్వం, తులసి, కదిరిపచ్చ, పన్నీరు పత్రాలతో శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారికి శనివారం పుష్పార్చన చేశారు. నేత్ర పర్వంగా సాగిన పుష్పయాగాన్ని వీక్షించి భక్తులు పులకించారు. ఇటీవల నిర్వహించిన బ్రహ్మోత్సవాల్లో తెలిసో తెలియకో జరిగిన దోషాల పరిహారార్థం టీటీడీ సుమారు 4టన్నుల పుష్పాలతో యాగం చేపట్టింది. ఈసందర్భంగా శ్రీనివాసమంగాపురం ఆలయంలో వేకువ జామునే స్వామివారిని సుప్రభాతంతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలను సమర్పించారు. ఉదయం 10గంటలకు స్నపన తిరుమంజనం జరిపించారు. అనంతరం దాతలు సమర్పించిన పుష్పాలకు కల్యాణ మండపంలో ప్రత్యేక పూజలను నిర్వహించి, ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. మధ్యాహ్నం 2.30 నుంచి 4.30 గంటలకు వరకు వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిదద్యాల నడుమ పుష్పాలు, పత్రాలను స్వామివారికి అర్చకులు సమర్పించారు. కార్యక్రమంలో టీటీడీ బోర్డు చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి సతీమణి స్వర్ణలత, ఆలయ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గురుమూర్తి, సూపరింటెండెంట్ వెంకటస్వామి, ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్ పాల్గొన్నారు.

కల్యాణ వెంకన్నకు స్వర్ణాభరణాలు

శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారికి శనివారం దాతలు స్వర్ణాభరణాలను వితరణగా అందించారు. నెల్లూరుకు చెందిన వసుకి అప్పలాచార్యులు, కుటుంబసభ్యులు బంగారు చైనుతో కూడిన గండబేరుండ పతకం, సీతమ్మ ఉత్సవ మూర్తికి మంగళసూత్రాలను ఆలయ డిప్యూటీ ఈఓ వరలక్ష్మికి అందజేశారు. ఆమె మాట్లాడుతూ వీటి విలువ సుమారు రూ.7.54లక్షలు ఉంటుందన్నారు. అనంతరం దాతలకు ప్రత్యేక దర్శనం కల్పించి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందించారు.

చివరికి మునిగింది!

ఈ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి శ్రీకాళహస్తి మండలంలోని తిమ్మవరం గ్రామానికి చెందిన శేఖర్‌యాదవ్. సన్నకారు రైతు. ఇతను ఓ రైతు వద్ద ఐదు ఎకరాలను కౌలుకు తీసుకుని వరి సాగుచేశాడు. సుమారు లక్ష రూపాయలు అప్పుచేసి పెట్టుబడి పెట్టాడు. పంట చేతికొచ్చే సమయంలో శనివారం అకాల వర్షంతో పంట మొత్తం నేలకొరిగింది. ధాన్యం రాలిపోయింది. దీంతో ఏంచేయాలో తెలియక రైతు లబోదిబోమంటూ కన్నీళ్లు పెట్టుకుంటున్నాడు.





కలవగుంటలో నేలకొరిగిన వరిపంట

- వడగండ్ల వాన బీభత్సం
- భారీగా దెబ్బతిన్న పంటలు
- లబోదిబోమంటున్న రైతులు

శ్రీకాళహస్తి రూరల్: జిల్లా వ్యాప్తంగా అకాల వర్షాలు రైతుకు వెన్నులో వణుకుపుట్టిస్తున్నాయి. రెండురోజులుగా అడపాదడపా వర్షాలు కురవడంతో చేతికొచ్చిన పంటలు నేలవాలుతున్నాయి. ఒబ్బిడి దశలో ఉన్న వరి దెబ్బతినగా వేరుశనగ పొలాల్లో నీళ్లు చేరుతున్నాయి. కొన్ని చోట్ల వడగండ్లవాన పడడంతో వరిపంటకు నష్టం వాటిల్లినట్టు రైతులు ఆవేదన చెందుతున్నారు. శ్రీకాళహస్తి మండలంలో ఖరీఫ్‌కింద 11,250 ఎకరాల్లో వరి సాగుచేశారు. ముందస్తుగా సాగుచేసిన కొంత మంది రైతులు ఒబ్బిడి దశలో ఉన్నారు. ఈ నేపథ్యంలో వర్షాలు రావడంతో కల్లాల్లోనే ధాన్యం తడిసి ముద్దయ్యింది. వడగండ్ల కారణంగా ధాన్యం నేలరాలుతోంది. గొల్లపల్లి, బీవీపురం, మేలచ్చూరు, తిమ్మవరం, అమ్మచెరువు, పాతగుంట, మంగలగుంట, ఎంపేడు, పాపనపల్లి, కలవగుంట, కోట, యార్లపూడి, గుండ్లపల్లి, నిమ్మరాళ్లపల్లి, కాళంపల్లి, పోలి, వాంపల్లి, భీమవరం, గోవిందరావుపల్లి, మామిడిగుంట తదితర గ్రామాల్లో వరి పంట సుమారు వెయ్యి ఎకరాల్లో దెబ్బతింది. గొల్లపల్లి, బీవీపురం గ్రామాల్లో 100 ఎకరాల్లో నీరు చేరినట్టు రైతులు చెబుతున్నారు. కాలంపల్లి, యార్లపూడి, కలవగుంట, వెలంపాడు గ్రామాల్లో 50 ఎకరాల్లో మామిడి పంట దెబ్బతింది. వెలంపాడు గ్రామంలో పిడుగుపాటుకు గుండుబోయిన సుబ్బయ్యకు చెందిన 10 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. వెంకటగిరి–ఏర్పేడు ప్రధాన రహదారిలోని ఎంపేడు గ్రామం వద్ద మహావృక్షం నేలకొరిగింది.

వాకాడులో తడిసిన ధాన్యం

వాకాడు మండలంలో దాదాపు 1050 ఎకరాల్లో వరి ఒబ్బిడి పనులు జరుగుతున్నాయి. కోత కోసి కల్లాల్లో ఉన్న ధాన్యం తడిసి ముద్దయ్యింది.

విద్యుత్‌శాఖకు రూ.10 లక్షల ఆస్తినష్టం

శ్రీకాళహస్తి విద్యుత్‌శాఖ డివిజన్ పరిధిలో విద్యుత్ శాఖకు రూ.10లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు తిరుపతి రూరల్ ఈఈ వాసురెడ్డి తెలిపారు. సుమారు 27 విద్యుత్ స్తంభాలు నేలకూలినట్లు వెల్లడించారు.

ఇక వర్షం పడితే ఇబ్బందే



జిల్లా వ్యాప్తంగా వరి నూర్పిడి పనులు చేస్తున్నారు. వేరుశనగ ఒబ్బిడి పనులు మొదలుపెట్టారు. శనివారం కురిసిన వర్షంతో వరికి కొంత నష్టం కలిగినట్టు తెలుస్తోంది. వ్యవసాయశాఖ అధికారుల నివేదిక మేరకు నష్టం వివరాలు వెల్లడిస్తాం.
–ప్రసాద్‌రావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి



పిడుగుపాటుకు మృతి చెందిన గొర్రెలు



వాకాడులో తడిసిన ధాన్యం



వెంకటగిరి-ఏర్పేడు ప్రధాన రహదారిలో ఎంపేడు వద్ద నేలకొరిగిన చెట్టు

ఘనంగా విష్ణు ఆర్ట్ ఫౌండేషన్ వేడుకలు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మోహన్‌బాబు, విష్ణు తదితరులు

చంద్రగిరి : మోహన్‌బాబు యూనివర్సిటీలో విష్ణు ఆర్ట్ ఫౌండేషన్ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా వర్సిటీ చాన్సలర్ మోహన్ బాబు, ప్రో చాన్సలర్ మంచు విష్ణు హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విష్ణు మాట్లాడుతూ కళాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో 2005లో ఫౌండేషన్ స్థాపించామన్నారు. 2009లో న్యూయార్క్‌లో జరిగిన ఆర్ట్ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించిన విఘ్నేశ్వరుడి బొమ్మ చూశానని, విచారిస్తే అది శ్రీకాళహస్తికి చెందిన గురజాల రమేష్ వేసినట్లు తెలిసి సంతోషపడినట్లు వివరించారు. మన ప్రాంతంలోని గొప్ప కళాకారుడిని గుర్తించలేకపోయినందుకు ఆవేదన చెందానని తెలిపారు. అందుకే ఆర్ట్ ఫౌండేషన్ ద్వారా దేశంలోని గొప్ప ఆర్టిస్టులను గుర్తించి, ప్రోత్సాహం అందిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం పలువురు కళాకారులు తమ నైపుణ్యాలను ప్రదర్శించారు. మనసుకు హత్తుకునేలా చిత్రాలను చిత్రించి కట్టిపడేశారు. అందులో పద్మశ్రీ అవార్డు గ్రహీతలు కాల లక్ష్మణ్ గౌడ్, పరేష్ మెహతీల పెయింటింగ్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మంచు విష్ణు తనయుడు మంచు అవిరామ్ చిత్రకారులతో కలసి పెయింటింగ్ వేయడం చూపరులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఎంబీయూ ఈడీ వినయ్ మహేశ్వరి, మంచు విష్ణు సతీమణి వెరోనికా పాల్గొన్నారు.

కారు బోల్తా

వెంకటగిరి : పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద శనివారం గూడూరు నుంచి తిరుపతి వైపు వెళుతున్న కారు అదుపు తప్పి బోల్తా పడింది. భారీ వర్షం కురుస్తుండడంతో రోడ్డు సరిగా కనిపించక పక్కనే ఉన్న కాలువలో పడిపోయింది. క్రేన్‌సాయంతో కారును బయటకు తీశారు. ప్రమాదంలో ఎవరూ గాయపడలేదు.

పాతకక్షలతో వృద్ధుడి హత్య


కృష్ణయ్య మృతదేహం


వివరాలు సేకరిస్తున్న పోలీసులు

వెంకటగిరిరూరల్ : మండలంలోని పారవోలు దళితవాడలో శుక్రవారం రాత్రి పాతకక్షల కారణంగా ఓ వృద్ధుడు దారుణ హత్యకు గురయ్యాడు. వివరాలు.. దండవోలు కృష్ణయ్య(60) వ్యవసాయంతోపాటు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు గ్రామానికే చెందిన తూపిలి సుబ్రమణ్యంతో పొలం వివాదముంది. దీనిపై కొన్నేళ్లుగా గొడవలు పడుతున్నారు. పాత కక్షలను మనసులో పెట్టుకున్న సుబ్రమణ్యం మద్యం సేవించేందుకు కృష్ణయ్యను గ్రామ సమీపంలోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లాడు. ఇద్దరూ కలిసి మద్యం సేవిస్తుండగా వెంట తెచ్చుకున్న కత్తితో కృష్ణయ్య తలపై నరికేసి వెళ్లిపోయాడు. కృష్ణయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని గమనించిన గ్రామస్తులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు అర్ధరాత్రి సమయం కావడంతో శనివారం ఉదయం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వెంకటగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.